## క్లుప్తంగా

### ఆలయాలు మూసివేత

**జూలూరుపాడు:** చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఆలయాలను మూసివేశారు. కాకర్ల శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం, పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వ ఆలయం, శ్రీఆంజనేయస్వామి ఆలయం, శ్రీ కోటమైసమ్మ ఆలయం, జూలూరుపాడు, పడమటనర్సాపురం, సురారం శ్రీసీతారామాలయాలు, గుండెపుడి, వెంగన్నపాలెం, అనంతారం, భేతాళపాడు శ్రీఅభయాంజనేయస్వామి ఆలయాలు, వెంగన్నపాలెం శ్రీసాయి బాబా ఆలయం, జూలూరుపాడు, కరివారిగూడెం శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలు, కొమ్ముగూడెం శ్రీపెద్దమ్మతల్లి ఆలయాన్ని అర్చకులు మూసివేశారు. చంద్రగ్రహణం ఆదివారం రాత్రి 9.56 గంటల నుంచి ప్రారంభమై సోమవారం తెల్లవారుజాము 1.45 గంటలకు ముగుస్తుందని అర్చకులు పేర్కొన్నారు. సంప్రోక్షణ, శుద్ధి తదితర వైదిక కార్యక్రమాల అనంతరం ఉదయం 7.30 గంటలకు భక్తులకు దర్శనం కల్పించడం జరుగుతుందని చెప్పారు.

### మోహన్‌రావుకు నేషనల్ బిల్డర్ అవార్డు



మోహన్‌రావుకు సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

**టేకులపల్లి:** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఇటీవల కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, ఫిజిక్స్ టీచర్ ఎం.మోహన్‌రావుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం కొత్తగూడెం ఐఎంఏ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తూ ఎల్లప్పుడూ విద్యార్థుల ప్రగతి కోసం పాటు పడుతూ అంకితభావంతో పని చేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను గుర్తించి ఘనంగా సన్మానించారు.

### ప్రభుత్వ ఖాజీ తొలగింపు

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెం ప్రభుత్వ ఖాజీ అయిన తెలంగాణ రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారి రషీద్ ఖాన్‌ను తొలగించినట్లు అహలే సన్నత్వల్ జమాత్ జిల్లా చైర్మన్ ఎంఏ రజాక్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రషీద్‌ఖాన్ అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కొత్త ఖాజీని నియమించే వరకు శుభ కార్యాలు, ఇతర కార్యకలాపాలకు పాల్వంచ ఖాజీని సంప్రదించాలని సూచించారు.

### ఉద్యోగ, ఉపాధి కల్పనలో విఫలం



మాట్లాడుతున్న మోతీలాల్

**ఇల్లెందురూరల్:** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వాంకుడోత్ మోతీలాల్, న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు ఆరోపించారు. పోలారం గ్రామంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. ప్రతీ గ్రామంలో బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తూ యువతను మద్యానికి బానిసలుగా మారుతస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో వాంకుడోత్ సరోజిని, భావ్‌సింగ్, హనుమ, నరేష్, బద్రి పాల్గొన్నారు.

### బోర్ వెల్ మంజూరు



బోర్ డ్రిల్ చేస్తున్న దృశ్యం

**జూలూరుపాడు:** వినోభానగర్ ఎస్సీ కాలనీలో ప్రజల తాగునీటి సమస్య తీర్చేందుకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ రూ.5 లక్షలు మంజూరు చేశారు. బోర్ వెల్, పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం బోర్ బావిని డ్రిల్ చేశారు. బోర్ వెల్‌కు మోటార్‌ను అమర్చి, డైరెక్ట్ పంపింగ్ ద్వారా వినోభానగర్ కాలనీలో తాగునీటిని సరఫరా చేయనున్నారు. కార్యక్రమంలో చౌడం నరసింహారావు, బోడా నాగరాజు, సిరికొండ నరసింహారావు, గంగావత్ లక్ష్మణ్, గుగులోత్ నరసింహారావు, పంచాయతీ సిబ్బంది నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్

# ఇంకెప్పుడు?

- 2022లో రూ.4.50కోట్లతో చేపట్టిన పనులు
- మూడేళ్లు దాటినా పూర్తి కాని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్
- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న వైనం





పాల్వంచలో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (ఇన్‌సెట్) 2022లో ప్రారంభించిన శిలాఫలకం

**పాల్వంచ:** వెజ్, నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రెండేళ్లుగా మోక్షం లభించడం లేదు. కూరగాయలు, చికెన్, మటన్, చేపల మార్కెట్ అంతా ఒకే చోట ఉండేలా చేపట్టిన పనులు మున్సిపాలిటీల్లో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మార్కెట్ నిర్మాణం కోసం గతంలో ఉన్న మార్కెట్‌ను తొలగించి పనులు చేపట్టారు. ఈ పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో చిరు వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాల్వంచ పట్టణంలో 2022లో రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో ప్రారంభించారు. కాగా సగం పనులు అయ్యాయి. కానీ అందులో 30 శాతం నిధులు కూడా విడుదల కాలేదు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ ఎక్కడి పనులను అక్కడే వదిలేశారు.

**కార్పొరేషన్ నిధులైనా వెచ్చించేనా?**

గతంలో ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు సైతం నిధుల లేమి కారణంగా మధ్యలో నిలిచిపోయాయి. దీంతో కార్పొరేషన్ నిధులు వెచ్చించి పూర్తి చేశారు. అయితే పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కొత్తగూడెం, పాల్వంచలో పనులు చేపట్టగా రెండుచోట్లా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అయితే ఇటీవల కొత్తగూడెం కార్పొరేషన్‌గా కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాలు మారడంతో ఈ మార్కెట్ పనులకు కార్పొరేషన్ నిధులు వెచ్చించి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**అవస్థలు పడుతున్న చిరువ్యాపారులు...**

మార్కెట్ యార్డ్‌లో వెజ్, నాన్‌వెజ్ కోసం ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. కాగా ఈ పనుల కోసం గతంలో ఉన్న మార్కెట్‌ను ఖాళీ చేయించి, అదే స్థలంలో పనులు చేపట్టారు. దీంతో ఖాళీ అయిన చిరు వ్యాపారులు వివిధ ప్రాంతాల్లో మళ్లీ ఫుట్‌పాత్‌లను ఆశ్రయించాల్సి వచ్చింది. పనులు త్వరితగతిన పూర్తయితే వెంటనే కొత్త మార్కెట్‌లోకి వెళ్లే అవకాశం ఉందని భావించారు. అయితే ఈ పనులు పూర్తికాక ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారులు చేసుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండటం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రత్యామ్నాయం చూపించలేక అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారు. ఈ సమస్యలపై ప్రస్తుతం ప్రభుత్వం మరింత దృష్టి సారించి పనులు త్వరగా పూర్తిచేయాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.

**రోడ్డు పక్కనే వ్యాపారం చేసుకుంటున్నాం..**



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం గతంలో మేం ఉన్న మార్కెట్‌ను ఖాళీ చేయించారు. దీంతో బతుకు దెరువు కోసం మార్కెట్ ఎదుట రోడ్డు పక్కనే పట్టాలు కట్టుకుని వ్యాపారం చేస్తున్నాం. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి. ఎండ, వానకు ఇబ్బంది పడుతున్నాం. – కృష్ణ, కూరగాయల వ్యాపారి

**కార్పొరేషన్ నిధులతో పూర్తిచేయాలి..**



నిధుల లేమి కారణంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం నిలిచిపోయాయి. కార్పొరేషన్ నుంచి అయినా నిధులు కేటాయించి వెంటనే పనులు పూర్తి చేయించాలి. ప్రజల, చిరు వ్యాపారుల ఇబ్బందులను పరిష్కరించాలి.
– రమేష్ రాథోడ్, పాల్వంచ

**నిధులు రాక పనులు నిలిచాయి..**

గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లు ప్రారంభం అయ్యాయి. అయితే నిధులు లేక ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. అంతటా ఇదే పరిస్థితి ఉంది. 30 శాతం నిధులు కూడా విడుదల కాలేదు. నిధులు వస్తే వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుంది. చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నది నిజమే.
– శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ డీఈ

## ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో రామ్‌ప్రసాద్

**కొత్తగూడెంఅర్బన్:** ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని, సమాజం సరైన మార్గంలో పయనించాలంటే ఉపాధ్యాయులే బాధ్యతలు తీసుకోవాలని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఎస్‌వీ రామ్‌ప్రసాద్ అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్న 15మంది ఉపాధ్యాయులకు నేషన్ బిల్డర్ అవార్డులు, మరో నలుగురికి ఒకేషనల్ అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా సమాజసేవలు అందిస్తోందన్నారు. పోలియో నిర్మూలనకు, విద్య, పర్యావరణ పరిరక్షణ, మాతాశిశు ఆరోగ్య పరిరక్షణ, మహిళా సాధికారత సమాజ అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ఈ అవార్డులను స్ఫూర్తిగా తీసుకుని ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంతో సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. జె.అబ్రహం, జక్కుల రవికుమార్, ఎస్.చలపతిరావు, పి.సుజాత, ఉండేటి ఆనందకుమార్, అంకం పాపయ్య, నాగరాజశేఖర్, ప్రసన్నకుమార్, పి.వెంకట్రామయ్య, పాతూరి దుర్గారాణి, పోసాని అరుణ, సత్యనారాయణ, సంధ్యారాణి పాల్గొన్నారు.

### నేడు చెక్కుల పంపిణీ

**జూలూరుపాడు:** స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు జరగనున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెక్కులు పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### వారసత్వ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డీజీఎం తుకారాం

**ఇల్లెందు:** సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆదేశాల మేరకు మెడికల్ ఇన్ వాలిడేషన్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాల కోసం ముఖాముఖీ నిర్వహించారు. ఆదివారం జీఎం కార్యాలయంలో డీజీఎం పర్సనల్ తుకారాం, జేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ జేకే ఓసీ నుంచి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల వారసులకు కుటుంబ సభ్యుల సమక్షంలో ఇంటర్వ్యూ నిర్వహించి వైద్య పరీక్షల అనంతరం నియామక ఉత్తర్వ్యులు అందజేస్తామని తెలిపారు. సీనియర్ పర్సనల్ ఆఫీసర్ అజయ్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీలందరూ ఏకం కావాలి..



కొత్తగూడెంటౌన్: మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

**కొత్తగూడెంటౌన్:** ప్రభుత్వం ఎస్టీ ఉప తెగల మధ్య అనిశ్చితికి తెరదించాలని, అందుకు లంబాడీలందరూ ఏకం కావాలని లంబాడీ కుల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో జేఏసీ సమావేశంలో నాయకులు గుగులోతు రాజేష్ నాయక్, ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడారు. 1979 లో పార్లమెంట్ ఆమోదంతో ఎస్టీ జాబితాలో చేర్చబడ్డ ఉపకులాలు (లంబాడీలు, ఎరుకలు, యానాది) పేర్ల జాబితాను ఈ నెల 9న సుప్రీంకోర్టులో సమర్పించాలని డిమాండ్ చేశారు. 14న లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుంచి కొత్తగూడెం పోస్టాఫీస్ వరకు ర్యాలీని నిర్వహించనున్నట్లు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. లావుడ్యా ప్రసాద్‌నాయక్, మూడు బాలాజీ, లాల్ సింగ్ రాములు, హతీరామ్, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్ రాథోడ్ పాల్గొన్నారు.

**ర్యాలీని జయప్రదం చేయండి..**

**టేకులపల్లి:** 8న టేకులపల్లిలో లంబాడీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆత్మగౌరవ శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని లంబాడీ సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లి మండలం సేవాగడ్ సేవాలాల్ ఆలయంలో జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తీసివేయాలని సుప్రీంకోర్టులో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు ఫిర్యాదు చేశారని దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ధరావత్ ప్రేమ్‌చంద్, గన్యా, దళ్‌సింగ్, లాలు, హుస్సేన్, కృష్ణ, లక్ష్మణ్, రామ, పాపా, సైదులు, రవిరాథోడ్, పూన్యా, కిషోర్, కిషన్, బాలకృష్ణ, సక్రు తదితరులు పాల్గొన్నారు.

## సొంతిల్లు కావాలా.. క్వార్టర్ కావాలా ?

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి కార్మికుల సొంతింటి కల సాధనలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీలలో సింగరేణి వ్యాప్తంగా బ్యాలెట్ ఓటింగ్ చేపట్టనున్నారు. ఈ విషయమై సీఐటీయూ సింగరేణి వ్యాపిత గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద పలు ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. సింగరేణి కార్మికులకు గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ 18 నెలలుగా ఆందోళన బాట చేపట్టింది. ఇందులో భాగంగా సీఎం, డిప్యూటీ సీఎంల తోపాటు కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలకు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు సైతం వినతి పత్రాలు, సంస్థలో ఉన్న క్వార్టర్ల వివరాలు, సింగరేణి స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయి. అవి ఎవరి ఆధీనంలో ఉన్నాయి కూడా తెలుసుకోనున్నారు. చివరి అస్త్రంగా బ్యాలెట్ ఓటింగ్‌ను ఎంచుకున్నారు. 11, 12 తేదీలలో బ్యాలెట్ ఓటింగ్‌తో కార్మికుల అభిప్రాయ సేకరణ చేస్తున్నారు.

**అభిప్రాయం చెప్పాలి..**



కార్మికుల మనోభావం తెలుసుకునేందుకు సొంత ఇల్లు కావాలా..కంపెనీ క్వార్టర్ కావాలా ? బ్యాలెట్ ఓటింగ్‌లో యూనియన్లకు అతీతంగా కా ర్మికులు పాల్గొనాలి. తరువాత యాజమాన్యంతో యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి, సొంతింటి కల నెరవేర్చేందుకు ఆందోళనలు చేపడతాము.
– వి.శ్రీనివాస్, సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి

**కల నెరవేరితే సంతోషం..**



గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఎన్నికల సమయంలో కార్మికులకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చారు. ఇప్పుడు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఇది సీఐటీయూకు అవకాశంగా తీసుకుంది. బ్యాలెట్ ద్వారా కార్మికుల చిరకాల కోరిక సాధిస్తే, అంతకంటే కావాల్సింది ఏముంటుంది.
– మొగిలిపాక రవి, బీఎంఎస్ ఉపాధ్యక్షుడు

## పోటాపోటీగా గణేష్ లడ్డూ వేలంపాట



ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో రూ.43వేలకు లడ్డూను కైవసం చేసుకున్న బన్సీలాల్

**టేకులపల్లి:** మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో సుమారు రెండు వందలకు పైగా గణేష్ మండపాలు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాల్లో గణేష్ లడ్డూ, వెండి కలశం, పట్టు వస్త్రాలు, జంజం తదితరములు వేలం వేశారు. ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో బానోతు బన్సీలాల్ రూ.43వేలు, వెంకట్యాతండా మెయిన్ రోడ్ సెంటర్‌లో తేజావత్ నరేష్ రూ.36వేలు, రాంపురంలో ఇస్లావత్ బాల్యా రూ.35వేలు, మణికంఠ యూత్ రూ.33,500, చుక్కాలబోడులో మాలోతు బిగిజా నాయక్ రూ.33,616, సింగ్యాతండాలో మాలోతు మంగీలాల్ రూ.25వేలు, బేతంపూడి చీమ్లా నాయక్ తండాలో దారావత్ రాజు రూ.16వేలకు లడ్డూలను కైవసం చేసుకున్నారు. టేకులపల్లి ఎక్స్ రోడ్డులోని మండపంలో వెండి కలశం రూ.26,516లకు పోటు వెంకటేశ్వర్లు – నాగమణి దంపతులు, వెండి ఉత్తర జంజం రూ.8516లకు ఎనగందుల రామకృష్ణ – లావణ్య దంపతులు, పట్టు వస్త్రాలు రూ.6516లకు సామినేని సతీష్, రూ.1020, దండ రూ.10,116లకు రాజస్థాన్ హరీష్ కైవసం చేసుకున్నారు. సోమవారం టేకులపల్లి సెంటర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

## ఓటరు జాబితాపై నేడు సమావేశం

**పాల్వంచరూరల్:** మండలంలోని ఓటర్ల ముసాయిదా, పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేసిన సందర్భంగా నేడు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.విజయ భాస్కర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పది ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల ముసాయిదా జాబితాను మండల ప్రజా పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై అంటించినట్లు పేర్కొన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే నేడు ఎంపీడీఓ, లేదా జిల్లా పరిషత్ కార్యాలయాల్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నేడు 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల మండల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. తుది ప్రాదేశిక నియోజకవర్గ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితాలను ఈనెల 10వ తేదీన ప్రచురించనున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం ఓటర్లు 28,921 మంది ఉండగా, ఇందులో పురుషులు 13,972, మహిళలు 14,947, ఇతరులు ఇద్దరు ఉన్నట్లు పేర్కొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించండి..



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**సింగరేణి(కొత్తగూడెం):** రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న యూరియా సమస్యను, ఫారెస్ట్ అధికారుల పంటల ధ్వంసం సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదును సమయంలో రైతులు సాగుచేసుకుంటున్న పంటలకు యూరియా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. యూరియా సమస్య వలన అనేక మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లైన్‌లో నిలపడితే ఒక బస్తా కూడా దొరకడం లేదన్నారు. దీంతో రైతులు అధికారుల మధ్య గ్రామాల్లో ఘర్షణ జరుగుతోందదన్నారు. పోడు భూముల పేరుతో ఫారెస్ట్ అధికారులు సమాచారం ఇవ్వకుండా చేతికి వచ్చిన పంటను సర్వ నాశనం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని దీనిని మానుకోవాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్, డీఎఫ్ఓ చొరవ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే ఉమర్, కుంజ కృష్ణ, మారుతి రాఘవులు, రమేష్, కొండపనేని సత్యనారాయణ, పామర్తి లక్ష్మయ్య, సవాళ్ల ఆదినారాయణ, నాగరాజు, మోటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలి



వినోభానగర్ ప్రాథమికోన్నత పాఠశాల

**జూలూరుపాడు:** వినోభానగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోనే ప్రీ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆదివారం గ్రామస్తులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ యూకేజీ తరగతుల కోసం వినోభానగర్ ప్రభుత్వ పాఠశాలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు ప్రీ ప్రైమరీ స్కూల్‌కు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా పాఠశాల మరమ్మతుల కోసం రూ.1.70 లక్షలు, గర్ల్స్ టాయిలెట్స్ నిర్మాణం కోసం రూ.2 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం, జూలూరుపాడు కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు తెలియకుండా, ఎస్ఎంసీ తీర్మానం లేకుండా ప్రీ ప్రైమరీ స్కూల్‌ను కాకర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేయడం అన్యాయమన్నారు. వినోభానగర్ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని, తరగతి గదులు, టాయిలెట్స్, ఆటస్థలం ఉన్నప్పటికీ మరో చోటుకు తరలించడం గర్హనీయమన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 60 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. ఈ విషయంపై ఎంఈఓను కలిసి ఇక్కడే ప్రీ ప్రైమరీ స్కూల్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. అదేవిధంగా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వినోభానగర్‌లో ప్రీ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్‌ను వివరణ కోరగా వినోభానగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సౌకర్యాలు లేవని చెప్పారు. 1 నుంచి 7వ తరగతి వరకు మూడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయని, భవనం స్లాబ్ వర్షం వస్తే కురుస్తోందని, తలుపులు, కిటికీలు సరిగా లేకపోవడం, ప్రత్యేక తరగతి గదిలేనందున వివరాలను ఉన్నతాధికారులకు అందజేసినట్లు చెప్పారు. వారి ఆదేశాల మేరకు కాకర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రీ ప్రైమరీ స్కూల్ బదిలీ చేసి, తాత్కలిక పద్ధతిలో టీచర్, ఆయా పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

## వారధి కష్టాలు తీరేనా..?

- కలగానే తూర్పుగూడెం వాగుపై వంతెన
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు



ప్రమాదకరంగా వాగు దాటుతున్న దృశ్యం (ఫైల్)

**సుజాతనగర్:** అక్కడ ఏళ్లుగా వంతెన లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరద తగ్గే రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి. సమస్యను పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా మిగిలిందే తప్ప ప్రయోజనం కలగలేదు. కొన్ని సమయాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణంపై దృష్టి సారించాలని పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సుజాతనగర్ మండలంలోని బేతంపూడి, టేకులపల్లి మండలం తూర్పుగూడెం గ్రామాల మధ్య తూర్పుగూడెం వాగు ఉంది. ఇల్లెందు మండలంలోని రోళ్లపాడు, చీమలపాడు దిగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరంతా ఈ వాగు గుండా ప్రవహించి కొత్తగూడెం ముర్రేడులో కలుస్తుంది. తూర్పుగూడెం వద్ద బ్రిడ్జి నిర్మించాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**వాగొస్తే.. రాకపోకలు బంద్..**

వంతెన నిర్మించాల్సిన ప్రదేశం చాలా లోతుగా ఉంటుంది. వర్షాకాలంలో వాగు వస్తు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వరద తగ్గేవరకు ఈ గ్రామాల ప్రజలకు సుమారు వారం రోజులు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వాగు దాటుతున్న క్రమంలో వరద ఉధృతికి కొట్టుకొనిపోయి ఇద్దరు వ్యక్తులు కూడా మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి.

**వంతెన నిర్మిస్తే... కష్టాలు తీరినట్లే..**

ముత్యాలంపాడు, టేకులపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు సుజాతనగర్ మీదుగా ఖమ్మం రావాలంటే ఈ దారి గుండా వస్తే సుమారు 30 కి.మీ దూరం తగ్గుతుంది. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో వాగు దాటలేక సుజాతనగర్ వైపు నుంచి అటుగా వెళ్లాల్సిన వారు, అటు నుంచి ఇటు రావాల్సిన వారు కొత్తగూడెం మీదుగా రావడం పోవడం జరుగుతోంది. దీనివలన అదనంగా 30 కి.మీ ప్రయాణించడంతో పాటు, సమయం, డబ్బు వృథా అవుతోంది. బేతంపూడి గ్రామంలో రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ముత్యాలంపాడు, టేకులపల్లి తదితర ప్రాంతాల ప్రజలు రైలు ప్రయాణం చేయాలంటే బేతంపూడి స్టేషన్‌కు వచ్చి రైలు ఎక్కుతుంటారు. వర్షాకాలంలో వాగు దాటేందుకు అవకాశం లేక కొత్తగూడెం వచ్చి రైలెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామాల మధ్య ఎప్పటి నుంచో మట్టి రోడ్డే ఉండటంతో వానాకాలంలో బురదమయంగా మారిన దారిలో నడవలేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం తూర్పుగూడెం గ్రామం వరకు బీటీ రోడ్డు సదుపాయం ఉంది. తూర్పుగూడెం వద్ద వంతెన నిర్మించడంతో పాటు, బేతంపూడి వరకు బీటీ రహదారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఇబ్బందులు తొలగించాలి..**



వాగు మీద వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వరద తగ్గేవరకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తోంది. వాగు ప్రవహిస్తున్న సమయంలో కొత్తగూడెం వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది.
– అజ్మీరా కిరణ్‌కుమార్, జామ్లా తండా

**వంతెన నిర్మించాలి..**



తూర్పుగూడెం వాగుపై వంతెన లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వంతెన ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేదు. ఇక్కడ వంతెన నిర్మిస్తే పది గ్రామాల ప్రజల సౌకర్యంగా ఉంటుంది.
– కాట్రాల తిరుపతిరావు, సీపీఎం నాయకుడు